ధాన్యానికి ధరలేక దిగాలు



మాద్వార్‌లో ఆరబోసిన వరిధాన్యం

- పెట్టుబడులు రాని వైనం
- జిల్లాల్లో లక్షా15 వేల ఎకరాల్లో వరి సాగు

మక్తల్: ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యానికి మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. రాత్రింబవళ్లు కష్టించి పండించిన ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మడానికి పెడితే వ్యాపారులు ఎవరూ కొనడానికి ముందుకు రాని దయనీయ పరిస్థితి దాపురించింది. నారాయణపేట జిల్లాలో 11 మండలాల్లో 77 క్లస్టర్ల పరిధిలో 1.15లక్షల ఎకరాల్లో 76వేల మంది రైతులు వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో మక్తల్ మండలంలో 2024లో రబీ సీజన్‌లో వరిపంటను విస్తారంగా పండించారు. మక్తల్ మండలంలో ముఖ్యంగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఎత్తిపోతల పథకాల కింద ఈ సంవత్సరం దాదాపు వందల ఎకారాల్లో వరి సాగు అయినట్లు వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ నుంచి సాగునీరు పెట్టుకోవడంతో వరి అధికంగా పండిన ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన ధర ఏ గ్రేడ్ రూ.2,203, బీ గ్రేడ్ రూ.2,187 ఉంది. మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ మండలాల్లో వరి అధికంగా సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.16వేల నుంచి రూ.18వేల వరకు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ రూ.2,200 ప్రస్తుతం క్వింటాల్‌కు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ధరలు సక్రమంగా లేకపోవడంతో కల్లాల్లో నిల్వ ఉంచారు. అయితే ఈ ధరకు ధాన్యం అమ్మితే పెట్టుబడులు రాక మళ్లీ అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కన్నా ఈ సారి వ్యవసాయ కూలీలకు రూ.500 నుంచి రూ.600 వరకు రెట్టింపు కావడంతో పెట్టుబడులు అమాంతంగా పెరిగిపోయాయన్నారు.



మాద్వార్‌లో పంట కోస్తున్న వరి కోత యంత్రం

మద్దతు ధర పెంచాలి



వరి ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచాలి. ప్రస్తుతం మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీని వల్ల అన్నదాతలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి.

– అరికేరి నవరప్ప, మాద్వార్

కష్టపడి పని చేస్తున్నాం



పంటలు సాగు చేసుకోనేందుకు రూ.వేలు ఖర్చుపెట్టి పంటలు సాగు చేసుకుంటున్నాం. ధాన్యానికి ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. ధరలు లేకపోవడంతో ధాన్యం ఎండకు ఆరబోసుకుంటున్నాం. కూలీల అధికంగా పెరగడంతో పాటు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి.

– నాగేష్, పస్పుల

అప్పుల పాలవుతున్నాం



ఎంతో కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో సరైన ధర రాకపోవడం వల్ల మళ్లీ అప్పుల పాలవుతున్నాం. ఇప్పటికే చేసిన అప్పులు తీర్చలేక సతమతమవుతుండగా, ఇప్పుడు పెట్టుబడులు కూడా రాకపోవడంతో కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– లక్ష్మన్, ముస్లాయిపల్లి

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

మక్తల్: కుర్వ కులస్తులకు ఆరాధ్యదైవమైన బీరప్ప ఉత్సవాలను మండలంలోని గుడిగండ్లలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుర్వకులాస్తులు శరీరంపై పసుపు చల్లుకుంటే తమకు సుఖ సంతోషాలు కలుగుతాయని ఇంట్లో అన్ని శుభాలు జరుగుతాయని నమ్మకం. దీంతో ఐదేళ్లకు ఒకసారి ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో దాదాపు 40వేలు మంది భక్తులు హాజరయ్యారు. నూతన వస్త్రాలు ధరించి పసుపు బండారును చల్లుకునేందుకు పోటీపడ్డారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, తదితరులు కార్యక్రమం ప్రారంభించి బండారు చల్లి ఆశీర్వదించారు.



జితేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కుర్వకులస్తులు

అధ్వానంగా సరిహద్దు రోడ్లు

కృష్ణా: మండలంలో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. మండలంలోని చేగుంట రైల్వేస్టేషన్ నుంచి ఐనాపూర్ లింక్ రోడ్డు వరకు, సూకూర్ లింగంపల్లి, కుసుమర్తి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్ల వెంట వర్షాకాలంలో అయితే ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.



ఐనాపూర్ సరిహద్దులో రోడ్డు దుస్థితి

దెబ్బతిన్న రోడ్లు

కృష్ణా మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఐనాపూర్ నుంచి కర్ణాటకలోని బాడియాల్ గల రోడ్డుతో పాటు చేగుంట బాడియాల్ రోడ్డు, సూకూర్ లింగంపల్లి నుంచి గూడూర్ ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. ఈ పరిస్థితులలో ఇటు తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులు, అటు కర్ణాటక ప్రాంత ప్రజాప్రతినిధులు ఈ రోడ్ల సమస్యను పరిష్కరిస్తే ఇరు ప్రాంతాల ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోతాయంటున్నారు. అటు పక్క ఉన్న కర్ణాటక ప్రాంతంలో మన సరిహద్దు వరకు బీటీ రోడ్లు వేశారు. కానీ మన ప్రాంత అధికారులు ఆ రోడ్ల పరిస్థితిని పట్టించుకోకపోవడం దారుణం. ఈ సరిహద్దు గ్రామాల రోడ్లను మెరుగుపరిచి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

రోడ్లను మెరుగుపర్చాలి



పక్కన ఉన్న కర్ణాటకలోని బాడియాల్ వెళ్లే రోడ్డును బీటీగా మార్చాలి. అక్కడి కర్ణాటక ప్రభుత్వం వారి సరిహద్దు వరకూ బీటీ రోడ్డుగా సంవత్సరం క్రితమే నిర్మించింది. మన ప్రభుత్వం మాత్రం మిగితా రోడ్డును పూర్తి చేయడం లేదు. ఈ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సూకూర్ లింగంపల్లికి ఉన్న మట్టి రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. రోడ్ల కోసం పప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

– అంజనమ్మ పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు

సమస్యను వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దూమర్ల నిరంజన్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఉన్నతీకరణ అంశాన్ని పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ముగిసిన వెంటనే పరిష్కరించాలని... తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (టీజీపెటా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్ కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టెట్‌కు సంబంధించి జాతీయ ఉపాధ్యాయ మండలి పంపిన పూర్తిస్థాయి వివరణను రాష్ట్ర పాఠశాల విద్యాకమిషనర్ వెల్లడి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీపీలను ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక అనుమతి తీసుకొని మంజూరు చేయాలని, ఎన్నికలు ముగిసిన వెంటనే అన్ని క్యాడర్ల పదోన్నతులు చేపట్టాలని కోరారు. సంఘం సలహాదారులు సూర్యప్రకాశ్, కోశాధికారి మొగులాల్, సభ్యులు ఆనంద్‌కుమార్, శంకర్‌నాయక్, సుచేతన్‌రెడ్డి, రాములు, మొయిన్, శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పేటకు మందకృష్ణ రాక

నారాయణపేట: జిల్లా కేంద్రానికి మంగళవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మధ్యాహ్నం 2 గంటలకు వస్తున్నారని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక అంజనా గార్డెన్ లో జరిగే సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ దళిత, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నారాయణపేట: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గొడుగు గెరి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్థానిక చిల్డ్రన్ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నా జగదీశ్, విజయ్ సాగర్, చెన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజు, సురేందర్‌రెడ్డి, మహిమూద్ అన్సారీ, ఫిరోజ్, జాకీర్ హజారే, తాజోద్దీన్, మైను, తాకి మొజాన్, వహిద్, రఘు, రఘు, బట్టి రవి, అప్పి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

నారాయణపేట రూరల్: మండలంలోని అంత్వార్ చెందిన రైతు శ్రీశైలం యూనియన్ బ్యాంకులో క్రాప్‌లోన్ రూ.1.50లక్షలు తీసుకున్నాడు. అదే సమయంలో ప్రమాదబీమా ప్రీమియం రూ.1,499 చెల్లించాడు. ఇటీవల ఆయన ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో ఆయనకు బీమా కింద రూ. 5లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును బ్యాంకు ఆర్ఎం సత్యనారాయణ, బీఎం వెంకటేష్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అందులో రైతు తీసుకున్న లోన్ రూ.1.50 పట్టుకుని రూ.3.50లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మక్తల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన పట్టణ సమీపంలోని తిరుమలయ్య చెరువుకట్ట వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని దాసర్‌దొడ్డికి చెందిన కటికెలి శంకరప్ప తన కూతురుని కలిసేందుకు ఖానాపూర్‌కు నడుచుకుంటూ బయలుదేరాడు. ఇదే సమయంలో మక్తల్ చెందిన వ్యక్తి బైక్‌పై వస్తూ శంకరప్పను ఢీకొట్టాడంతో గాయాలపాలయ్యాడు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పొలం నుంచి వెళ్తుండగా గాయపడిన వ్యక్తిని చూసి వెంటనే ఆస్పత్రికి తరలించారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కె. సుభాషిణికి చత్తీస్‌ఘడ్ కళింగ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. జంతుశాస్త్రంలో డా. అజయ్‌కుమార్ హరిత్ పర్యవేక్షణలో ఆమె పలు అంశాలపై పరిశోధన చేసిన నేపథ్యంలో డాక్టరేట్ వరించింది. కాగా సుభాషిణిని ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, అధ్యాపకబృందం సోమవారం అభినందించారు.



కె. సుభాషిణి

కాంగ్రెస్‌ను ఆదరిస్తే అభివృద్ధి చేస్తాం

ఊట్కూరు: కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి, మల్లేపల్లి, కొల్లూరు, అమిస్తాపూర్, పగిడిమారి తదితర గ్రామాలలో హర్‌గావ్ ఏక్ గంటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. 69 జీఓ వల్ల నారాయణపేట, కొడంగల్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మట్టి రోడ్లను భవిష్యత్‌లో బీటీ రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, యజ్ఞేశ్వర్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్, శ్రీనివాస్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



సమస్తపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

దామరగిద్ద: మండల కేంద్రంతో పాటు కాన్‌కుర్తి, మొగుల్‌మడ్క, మద్దెల్‌బీడ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ఎక్లాస్‌పూర్‌లో కూలీలకు మజ్జిగ అందజేసి ఓటు అడుగుతున్న నాయకులు

మరికల్: దేశ అభివృద్ధి కోసం ఉపాధి కూలీలు రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి వారికి మజ్జిగ అందజేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వేణు, రమేష్, రామేశ్వర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య మక్తల్ అంబేద్కర్ నగర్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కర్నిస్వామి, ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రాంరెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో విజయన్‌గౌడ్, దండు కృష్ణయ్య, మహావీర్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని 6వ వార్డులో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించార. కార్యక్రమంలో ఉమేష్, భాస్కర్, చంద్రకళ, లలిత, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి



మరికల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మరికల్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని పార్టీ నాయకులు మండల కేంద్రంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందకుండా చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. అలాగే అప్పంపల్లి, ఎలిగండ్ల, తీలేర్, మాధవరం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బసంత్, రామస్వామి, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, హన్మిరెడ్డి, ప్రకాష్‌శెట్టి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

దామరగిద్ద: కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు సుభాష్, భీమయ్యగౌడ్, వెంకట్ రెడ్డి, ఎంపీపీ నర్సప్ప కోరారు. మండలంలో అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ముదిరాజుల బిడ్డనై పనిచేస్తా..

నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ ఎంపీగా తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ముదిరాజుల బిడ్డనై పనిచేస్తానని అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సీవీఆర్ భవన్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఎన్నికలు వ్యక్తుల, పార్టీల మధ్య జరగడం లేదని, కేవలం పాలమూరు జిల్లా అభ్యున్నతి కోసం జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో మభ్యపెట్టే మాటలకు లోనై దారి తప్పి బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే మన భవిష్యత్ తరాల బతుకులు నాశనం అవుతాయన్నారు. సంక్షేమంతో పాటు సమాజంలో సామాజిక అభివృద్ధిని ముదిరాజులు సాధించాలనే రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మీ గొంతునై మీకు సేవచేసే అవకాశం కల్పించాలన్నారు.

మరికల్ దశ మారుస్తాం

మరికల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే మరికల్ పట్టణ దశ మారుస్తామని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మరికల్ చౌరస్తాలో సోమవారం ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సొంత పార్టీ నాయకులకు ప్రభుత్వ భూములను కట్టబెట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగనే కబ్జాలకు గురైన భూములకు విముక్తి కల్పించామన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మరికల్‌ను మున్సిపాలిటీతో పాటు జూనియర్ కళాశాల, మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుంభం శివకుమార్‌రెడ్డి, వీరన్న, సూర్యమోహన్, కృష్ణయ్య, గోపాల్, హరీష్, రామకృష్ణ, ఆంజనేయులు, మొగులప్ప పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి కింగ్‌షోటోకాన్ కరాటే దూ ఇండియా విద్యార్థి అర్ష్ జమీల్.. ఈనెల 8 నుంచి 12 వరకు డెహ్రాడూన్‌లో జరిగే కరాటే దూ ఇండియా ఆర్గనైజేషన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. మార్చి 3న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడంతో జాతీయస్థాయిలో అవకాశం వచ్చిందని వివరించారు. కాగా సోమవారం జిల్లా కేంద్రంలో అర్ష్ జమీల్‌ను ఘనంగా సన్మానించారు. కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఆద్యుడు సాహుమహరాజ్

వనపర్తి: తన రాజ్యంలో రిజర్వేషన్లు అమలు చేసి దేవాలయాల కంటే విద్యకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి, గుడులను బడులుగా మార్చిన మహోన్నతుడు సాహు మహారాజ్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం సాహు మహారాజ్ వర్ధంతి సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జై భీమ్ సేవా సంస్థ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ ఫలాలకు ఆద్యుడు సాహుమహారాజ్ చక్రవర్తి అని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్వాతంత్ర్యానికి పూర్వమే సమాన అవకాశాలు, రిజర్వేషన్ ఫలాలు అవసరమని భావించిన రుషితుల్యుడు సాహు మహారాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, గంధం నాగరాజు, పెద్ద నిరంజనయ్య, చిన్న నిరంజన్, రాధాకృష్ణ, వేణుగోపాల్‌నాయుడు, కేశపాగ వెంకటేష్, మద్దిలేటి, మిద్దె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



సాహుమహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ ఇనుప స్తంభం



అమరచింత సంతోష్‌నగర్‌లో వైర్లు బిగించని సిమెంట్ స్తంభం

అమరచింత: పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఇనుప విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతోందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. మూడు నెలల కిందట విద్యుత్ తీగలు తెగి పడటంతో ఒరిగిన ఇనుప స్తంభం తొలగించి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులు భావించారు. వెంటనే ఇనుప విద్యుత్ స్తంభం పక్కనే సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేసినా.. ఇప్పటి వరకు దానికి వైర్లు బిగించలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు, మున్సిపాలిటీ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం తొలగించి సిమెంట్ స్తంభానికి వైర్లు బిగించాలని కోరుతున్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

దేవరకద్ర: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో లీకేజీల కారణంగా తరచు నీటి సరాఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. వేసవి వల్ల నీటి సరాఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. గత వారం రాయిచూర్ రోడ్డు పక్కన ఓ ఇంటి యజమాని జేసీబీతో తవ్వడంతో ప్రధాన పైపులైన్ పగిలి పోయి మూడు రోజుల పాటు నీటి సరాఫరా నిలిచి పోయింది. మళ్లీ సోమవారం లీకేజీ పనుల కోసం నీటి సరాఫరాను నిలిపి వేశారు. దీని వల్ల కొత్త బస్టాండ్ ప్రాంత ప్రజలు నీటి ఇబ్బందులను తరచు ఎదుర్కొవలసి వస్తున్నది. లీకేసీ పనులు సోమవారం సాయంత్రం పూర్తి కావడంతో మంగళవారం ఉదయం నీటి సరాఫరా చేస్తామని అధికారులు తెలిపారు.



పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మరికల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లశర్మ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వేసవి యోగ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు యోగలో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం సమయంలో విద్యార్థులకు యోగలో వివిధ ఆసనాలను నేర్పిస్తామన్నారు.

బాలల రక్షణపై అవగాహన



మక్తల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు మహిళా సాధికారత ఆధ్వర్యంలో బాలలరక్షణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీహెచ్ఈడబ్ల్యూ సభ్యులు అనిత, రేణుక మాట్లాడుతూ బాలల సంబందించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో కృష్ణ, మారెప్ప, యాదయ్య, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మద్దూరు: మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై మహిళా సాధికారత కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అమర్‌గడ్డ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత ఆర్థిక నిపుణుడు విజయ్‌కుమార్ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఓపెన్ స్కూల్ తదితర వాటిని వివరిచారు. మహిళలు ఆర్థికంగా ఎదిగుతే దేశం ఆర్థికంగా ఎదుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ మెంటర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మాతృశ్రీ ఈశ్వరాంబ డేను పురస్కరించుకుని ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున అమ్మవారి చిత్రపటంతో పట్టణ పురవీధుల గుండా నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, భక్తిపాటలను ఆలపించారు. సాయి మహిమలు, ఆయన చేసిన సేవలను కొనియాడారు. బాబాకు తల్లి ప్రోత్సాహాన్ని వివరించారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, మల్లికార్జున్, గోపినాథ్‌రావు, ఆనంద్‌చారి, బీవీఎస్‌రెడ్డి, శివరాజ్, మాధవరెడ్డి, విరూజ, సుగమ్మ, లలిత, రియా మాధురి పాల్గొన్నారు.

మాసశివరాత్రి పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులోని వైరాలగుట్టపై వెలసిన శివాలయంలో సోమవారం మాసశివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివుడికి అభిషేకం చేయడంతో పాటు భక్తులు భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మాసశివరాత్రి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, యాదిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.